క్లుప్తంగా

సమస్యలపై అధికారులు స్పందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి

శింగనమల: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలని ఎంపీపీ యోగేశ్వరి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ అన్వేష్ కుమార్ మాట్లాడుతూ రైతులు పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, వైస్ ఎంపీపీ విజయ, కోఆప్షన్ మెంబరు ఆలీ, సర్పంచ్‌లు బొమ్మన గోపాలు రెడ్డి, నాగమునెమ్మ , ముత్యాల ఆదినారాయణరెడ్డి, ఓబిలేసు, అధికారులు పాల్గొన్నారు.

పల్లవి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లు రూరల్: ప్రభుత్వ అనుమతి లేకుండా స్కూల్‌లో హాస్టల్ నిర్వహిస్తున్న పల్లవి హైస్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు పల్లవి స్కూల్ యాజమాన్యం నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్ని చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధిక మొత్తంలో ఫీజుల వసూళ్లకు పాల్పడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు, విద్యార్థుల పైనా వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి స్కూల్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నాలుగో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 26 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులని ఆయన తెలిపారు. ఈ నెల 28న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి సహకరించండి


డీఆర్ఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాయచూర్ ఎమ్మెల్యే

గుంతకల్లు: కర్ణాటకలోని రాయచూర్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. గురువారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన డీఆర్ఎం విజయ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాయచూర్ జంక్షన్‌లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు


పేకాటరాయుళ్ల అరెస్టు చూపుతున్న సీఐ

యాడికి: మండలంలోని లక్ష్ముంపల్లెలో పేకాట స్థావరంపై గురువారం రాత్రి దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఓ ద్విచక్ర వాహనం సీజ్ చేశామన్నారు. పేకాట రాయుళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు ధ్వంసం కేసులో నిందితుల అరెస్ట్


నిందితులను చూపుతున్న పోలీసులు

యాడికి: వెంగన్నపల్లిలో ఈ నెల 11వ తేదీన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొట్టే విజయ భాస్కర్‌రెడ్డి కారును ధ్వంసం చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తిరునాథరెడ్డి, రంగస్వామిరెడ్డి, కుమ్మెత సూర్యనారాయణరెడ్డి, కుమ్మెత వెంకటనారాయణరెడ్డి, మొలక శ్రీరాములు, గుత్తి వెంకటరెడ్డి, కేశంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అనంతరం ఉరవకొండ కోర్టులో హాజరు పరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సీఐ ఈరన్న తెలిపారు.



పేదలకు వైద్య విద్య భారం

పేద విద్యార్థులు డొనేషన్లు కట్టి ప్రైవేటు కళాశాలల్లో చదవడం చాలా భారమైన పని. ఇప్పటి వరకూ పేదలకు వైద్య విద్య అనేది అందని ద్రాక్షగా మిగిలింది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు మంజూరయ్యాయి. పేద విద్యార్థులు ఎంబీబీఎస్ చదవాలంటే ప్రభుత్వ మెడికల్ కళాశాలల అవసరం ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లింది. ఆ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలి.

– వినోద్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు, గుంతకల్లు



పేద విద్యార్థులకు అన్యాయం



కూటమి ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించకపోవడం దారుణం. ఎవరికో పేరొస్తుందని వేలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడం అన్యాయం. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ఆలోచన సరికాదు. వెంటనే కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి అదనపు సీట్లు కేటాయించేలా చూడాలి.

-పీ వరప్రసాద్ పామిడి

మట్కా ఓపెన్.. జీవితం క్లోజ్



- నులువుగా డబ్బులు సంపాదిస్తున్న నిర్వాహకులు
- నెలకు రూ.లక్షల్లో లాభాలు
- మట్కా, పేకాటతో పేదల జీవితాలు బుగ్గిపాలు

యల్లనూరు: మట్కా మోజులో పడి అమాయకులు అప్పులపాలై జీవితాలను తాకట్టు పెట్టుకుంటున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలని మట్కా బీటర్లు, నిర్వాహకులు పేదల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. నిత్యం మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ రూ.లక్షలు అర్జిస్తున్నారు. మండలంలో ని తిమ్మంపల్లిలో రోజుకు రూ.10 లక్షలు విలువ చేసే పట్టీలు రాస్తున్నారు. మండలం మొత్తం మీద రూ.15 లక్షల విలువ చేసే మట్కా పట్టీలు తయారవుతున్నాయని సమాచారం. ఓపెన్‌కు ఓ రేట్, క్లోజ్‌కు మరో రేటు, బ్రాకెట్‌కు ఇంకో రేటు అంటూ పేదలకు ఆకరిస్తున్నారు. మట్కా, పేకాటను అడ్డుపెట్టుకుని కొందరు, పార్టీల పేర్లు చెప్పుకుంటూ నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు. మట్కా మోజులో పడ్డ అమాయక ప్రజలు రోజు కూలి డబ్బులు మొత్తం తగలేస్తున్నారు. దీంతో కుటుంబాలు గడవక పస్తులుంటున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మట్కా, పేకాటను అదుపుచేయడంలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేసి ఒకరో ఇద్దరిని రిమాండుకు పంపుతున్నారు. తోటల్లో పేకాట ఆడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మామూళ్ల మత్తులో పోలీసులు జోగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ. కోట్లు సంపాదించారు!

కొడవండ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి మట్కా డాన్‌గా పేరొందాడు. మట్కా పేరు చెప్పగానే అందరికీ అతడే గుర్తుకు వస్తాడు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ బీటర్ల ద్వారా మట్కా రాయిస్తూ కథ నడుపుతాడు. పనులన్నీ సెల్ ఫోన్‌లో నడుపుతున్నాడు. అక్రమంగా వచ్చిన డబ్బులతో ఎంజాయ్ చేస్తూ ఎవ్వరి వాటాలు వాళ్ల ఇస్తూ చేతులు దులుపుకుంటున్నాడు. తిమ్మంపల్లికి చెందిన ఇంకో వ్యక్తి మట్కా డాన్‌గా వ్యవహరిస్తూ ఇంట్లోనే కథను నడుపుతున్నాడు. అలాగే తిమ్మంపల్లికి చెందిన ఓ మట్కా బీటర్ పులివెందులలో రూ.కోట్లు విలువచేసే భవనాలు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తిమ్మంపల్లి, కొడవండ్లపల్లి, బుక్కాపురం, వాసాపురం, గడ్డంవారిపల్లి, కల్లూరు, వెన్నపూసపల్లి, యల్లనూరు తదితర గ్రామాల్లో మట్కా ఎక్కువగా ఆడుతున్నారు. తిమ్మంపల్లిలో మట్కా బీటర్లు అధికంగా ఉన్నారు. జిల్లా ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకటేశ్వర్లు స్పందించి మట్కా, పేకాటను నియంత్రించాలని మహిళలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మట్కా, పేకాటపై ఉక్కు పాదం మోపుతాం. మట్కా బీటర్లపై నిఘా పెట్టాం. ఎవ్వరినీ వదలం. కొందరు నిందితులు మా దృష్టిలో ఉన్నారు. సమయానికి కనిపించకుండా తిరుగుతున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు పంపుతాం.

– సీఐ సుబ్రహ్మణ్యం, పుట్లూరు

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


డీఎస్పీ శ్రీనివాస్

గుంతకల్లు: గుంతకల్లు డీఎస్పీగా ఆముదాల శ్రీనివాస్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డిని విజయవాడలో డీజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇక నెల్లూరు జిల్లా కందుకూరు డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను గుంతకల్లుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీ జగదీష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా రాత్రి డీఎస్పీ శివభాస్కర్ రెడ్డికి వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం జీఎల్ శంకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9959225856 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

ఘనంగా హిందీ దినోత్సవం

గుంతకల్లు: పట్టణంలోని శ్రీ శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో గురువారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోపాల్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు, అధ్యాపకులు వెంటకసుబ్బయ్య, సువర్ణదేవి, పర్యవేక్షులు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలో కొత్త ప్రాజెక్టులు నిర్మించాలి

గుంతకల్లు: రాయలసీమ వ్యాప్తంగా కొత్త ప్రాజెక్టులు నిర్మించాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఐటీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేలాది టీఎంసీల వరద నీరు సముద్రం పాలవుతోందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తే నీరు ఒడిసి పట్టుకోవడంతో కరువు సీమ కళకళలాడుతుందన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు కాశీరావు, నాయకులు కోటేశ్వరరావు, సుంకయ్య, కుళ్లాయప్ప, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జొన్న పంట నాశనంపై ఫిర్యాదు

పామిడి: 2.50 ఎకరాల్లో జొన్నపంటను నాశనం చేశారని పీ కొండాపురానికి చెందిన రైతు వడ్డే నారాయణస్వామి గురువారం సీఐ యుగంధర్, తహసీల్దార్ ఎస్ శ్రీధర్‌మూర్తికి వేర్వేరుగా ఫిర్యాదు చేశాడు. తన సమీపబంధువులైన పీట్ల సుధాకర్, పీట్ల రామచంద్ర వర్గీయులు జొన్న పంటకు గడ్డి మందు పిచికారీ చేశారన్నాడు. దీంతో రూ.1.50 లక్షలు నష్టం వాట్లిందని వాపోయాడు. అలాగే సర్వేనెంబర్ 262-1లో ఎకరా పొలాన్ని వారు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి న్యాయం చేస్తామని ఈసందర్భంగా తహసీల్దార్ ఆయనకు హామీ ఇచ్చారు.

ఉపాధి పనులు కల్పించండి

యల్లనూరు: మండల వ్యాప్తంగా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ షబ్బీర్‌బాషా సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. హార్టికల్చర్ ద్వారా అందించిన మొక్కలను కాపాడుకోవాలన్నారు. ఉపాధి రికార్డులను సక్రమంగా పెట్టుకోవాలని సూచించారు. ఈసీ బబ్లూ, టీఏలు ప్రతాప్, జయరాం, శంకర్, అదిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ శశికళ

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతో పాటు సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంపొందించుకోవాలని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శశికళ సూచించారు. గురువారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మూడు రోజుల పాటు ఎస్ఆర్ఐటీ కళాశాల అనుబంధంగా ఎస్‌సీఎస్‌టీసీ వారు క్యాటలైజ్డ్ అండ్ సపోర్టెడ్ బై ది నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలు, సైబర్ సమస్యలపై ఆమె క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వెంకటనాగజయుడు, కంప్యూటర్ సైన్స్ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగం అధిపతి డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్, రోటరీపురం ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సునీత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.2.10 లక్షల ఆర్థిక సాయం అందజేత


కల్లూరులో బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఫొటోగ్రాఫర్లు

గార్లదిన్నె: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి తోటి ఫొటోగ్రాఫర్లు అండగా నిలిచారు. వివరాలు.. మండలంలోని కల్లూరుకు చెందిన అన్నదమ్ములు ఫొటోగ్రాఫర్ సాయి, చిన్న గత నెల 29న పామిడి 44వ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. గురువారం వివిధ మండలాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు అందరూ కలసి రూ.1,79,000 పోగు చేశారు. అలాగే పామిడి జూనియర్ ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.31,000 మొత్తం రూ.2.10లక్షలు ఆర్థిక సాయం అందించారు. మృతి చెందిన సాయి కుమార్తె శ్రేష్టకుమారి పేరు మీద సుకన్య సమృద్ధి యోజన పథకం కింద రూ.1,50,000, కుమారుడు రోహిత్ కుమార్ పేరు మీద రూ.50,000 బ్యాంకులో డిపాజిట్ చేశారు. అలాగే మృతుని భార్య ప్రశాంతికి కుటుంబ అవసరాల నిమిత్తం రూ.10 వేలు నగదు అందించారు.

గుడిసెలు తొలగించండి

పామిడి: పట్టణ సమీపంలోని సర్వే నెంబర్-1లో కొండ పొరంబోకు ప్రభుత్వ స్థలంలో వెలసిన గుడిసెలను తొలగించాలంటూ తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి సూచించారు. గురువారం పేదల గుడిసెల ఏర్పాటుపై తహసీల్దార్ తన ఛాంబర్‌లో ఏపీ రైతు సంఘం నాయకులతో సమీక్షించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలు చేపట్టకూడదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వంపరంగా స్థలాలిచ్చి, ఇళ్ల నిర్మింపజేసేలా కృషి చేస్తానన్నారు. అక్రమంగా వెలసిన గుడెసెలను తొలగించకపోతే చట్టరీత్యా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కృష్ణ, వెంకటేష్, రంగనాయకులు. పేదలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


వడియం పేటలో పోటీను ప్రారంభిస్తున్న కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి


తాడిపత్రిలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ నాగరాజు, ఉపాధ్యాయులు

తాడిపత్రిటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ నాగరాజు, రామగోవింద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని హైస్కూల్ లో అండర్-14, -17 విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా మండలస్థాయి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభించారు. గురువారం యోగా, చెస్, షెటిల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పట్టణంలోని అన్ని పాఠశాలల 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నంద, కోఆర్డినేటర్ కాశివిశ్వనాథ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వేణు, లక్ష్మీనారాయణ, చంద్రకళ, ప్రత్యూష పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బుక్కరాయసముద్రం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వడియంపేటలో ఉన్న కేశవరెడ్డి పాఠశాలలో జోనల్ క్రీడలు ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడా కారులను పరిచయం చేసుకున్నారు. పోటీలకు వడియంపేట, అనంతపురం నగరంలోని మారుతీ నగర్, సాయి నగర్ బ్రాంచ్‌ల కేశవరెడ్డి స్కూల్ పాఠశాలలకు సంబంధించిన 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో శరీర ధారుడ్యం, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో కేశవరెడ్డి విద్యా సంస్థల ఏజీఎం, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన ముస్లిం, మైనార్టీ పాఠశాల విద్యార్థులు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం,మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అనంతపురం గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారన్నారు. అందులో ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-17, అండర్-14 కబడ్డీ, అండర్-14 వాలీబాల్, అండర్ -17 విభాగం ఖోఖో పోటీల్లో విజేతగా, వాలీబాల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు.గురువారం ఎంఈఓ మాట్లాడుతూ అండర్ -14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా చెస్, బ్యాట్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్- 14, అండర్-17 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు శనివారం నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలన్నారు. .

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


గుంతకల్లు మండలం తిమ్మాపురంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


తాడిపత్రి పట్టణంలో కస్తూరిబా విద్యార్థుల మానవహారం

గుంతకల్లు రూరల్/గుత్తి/తాడిపత్రి టౌన్/బుక్కరాయసముద్రం: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి సూచించారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం రక్తహీనత, హ్యాండ్ వాష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గుత్తి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, చైర్‌పర్సన్ వన్నూర్ బీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నెట్టికల్లు, బిల్లు కలెక్టర్ చంద్ర, ఏఈ కిరణ్, హెచ్ఎం సుబహాన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాడిపత్రి పట్టణంలోని కస్తూరిభా పాఠశాలలో స్వచ్ఛతా హీహి సేవ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు అట్టహాసంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ , ఎస్ఓ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సరస్వతి, షేక్ అబ్దుల్ రహీమ్, కౌన్సిలర్లు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ, స్పెషలాఫీసర్ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నవీద, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏఓ శ్రీవాణి, ఏపీఓ పోలేరయ్య, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ జనార్ధన్, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ట్రాన్స్ కో ఏఈ ప్రతాప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగవేణి తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం


బుక్కరాయసముద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

తాపీ ధర్మారావు జయంతి

గుంతకల్లు: పట్టణలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జేవీవీ ఆధ్వర్యంలో తాపీ ధర్మరావు 138వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, హెచ్ఎం హసీనా బాను, ఉపాధ్యాయులు జ్యోతి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

తాడిపత్రిటౌన్: పట్టణంలోని బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో బాల్య వివాహాలపై ఐసీడీఎస్ అధికారులు విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి రంగమ్మ మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం, బేటీ పడావో, బేటీ బచావో, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో డయల్ 100ను సంప్రదించాలన్నారు. సీడీపీఓ షాజిదాబేగం, సూపర్‌వైజర్లు రామలక్ష్మమ్మ, నారాయణమ్మ, వార్డెన్ కవిత పాల్గొన్నారు.

దంపతులపై దాడి

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో గురువారం రస్తా వివాదంలో దంపతులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు.. రామ్‌దాస్‌పేటకు చెందిన రైతులు శరత్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, అన్వర్ ఎగువపల్లికి చెందిన సింగరప్ప పొలంలో రస్తా ఏర్పాటుకు యత్నించారు. సమాచారం అందుకున్న సింగరప్ప, అతడి భార్య లీలావతి పొలానికి వెళ్లి ప్రశ్నించగా వారు దాడి చేశారు. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రామ్‌దాస్‌పేటకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.